కథ

# అతిథులు

కామరాజుగడ్డ వాసవదత్త రమణ
97044 44760

''అమ్మా! గోడ డిజైన్ చాలా బావుంది''.. కళ్లు విప్పార్చి చూస్తూ అన్నాడు పన్నెండేళ్ల జితేంద్ర.

''నీ గది నచ్చిందా జీతూ!'' మురిపెంగా కొడుకు వంక చూస్తూ అన్నది వైశాలి.

''రేయ్! ఆ గది నీది, మామ్మది కూడా! ఆ పక్కది మా బెడ్ రూమ్''.. వెనకనుంచి అన్నాడు రంగనాథ.

ముగ్గురూ కాసేపు కొత్త ఇల్లంతా సంబరంగా కలియ తిరిగి.. ఇంకా చేయాల్సిన పనులన్నీ బిల్డర్‌కి అప్పచెప్పి, ఇంటికి బయల్దేరారు.

ఇంకో మూడు నెలలకు కొత్తింటి గృహప్రవేశం చేశారు రంగనాథ, వైశాలి దంపతులు.

కొడుకు కొన్న కొత్తింటిని చూసి మురిసిపోయింది అతని తల్లి శ్యామలాంబ.

రోజులు వేగంగా గడిచి పోతున్నాయి.

* * *

జితేంద్రకు ఇంజినీరింగ్ సీటు వచ్చిన సంవత్సరం.. రంగనాథ పాత ఇంటిని అమ్మి, మూడు పడకల కొత్త ఫ్లాట్ కొన్నాడు.

''జితేంద్రా! ఇది నీ బెడ్‌రూమ్, ఆ పక్కది నీ స్టడీ రూమ్. బావుందా?''.. కొడుకు మెరిసే కళ్ల వంక చూస్తూ అన్నది వైశాలి.

''యా! నా రూమ్ బావుంది. ఫ్లాట్ కూడా చాలా విశాలంగా ఉందమ్మా!''..

అన్ని సరికొత్త హంగులతో, అప్పుడే వేసిన లేత రంగులలో మెరిసిపోతున్న తన గదిని చూసుకుంటూ సంతృప్తిగా తలాడిస్తూ అన్నాడు జితేంద్ర.

గృహప్రవేశానికి వచ్చిన స్నేహితులు, బంధువులంతా ఇల్లు చాలా బావుందన్నారు. రోజులు సంతోషంగా గడిచి పోతున్నాయి.

* * *

జితేంద్రకు ఖరగ్‌పూర్‌లో ఎంటెక్ సీట్ వచ్చింది. హాస్టల్‌లో చేర్పించడానికి వైశాలి, రంగనాథ కూడా వెంట వచ్చారు.

''ఏసీ గది అక్కర్లేదులే నాన్నా! ఇక్కడ హాస్టల్ రేట్స్ చాలా ఎక్కువగా ఉన్నాయి'' అన్నాడు జీతూ.

''నీ మొహం. నీకేం తెలియదు. వేడికి మాడిపోతావు. నాన్న అన్నీ చూసుకుంటారులే!'' కొడుకును వారిస్తూ అన్నది వైశాలి.

జీతూకు మంచి వసతిగా ఉన్న గదికోసం ఇద్దరూ ఆ రోజంతా బాగా తిరిగి, చివరికి మూడో అంతస్తులో ఉన్న ఒక విశాలమైన గదిలోకి చేర్చి.. ఫీజులన్నీ కట్టేసి, సామానంతా సర్దేసి.. ఇద్దరూ ఇంటికి తిరిగి వచ్చారు.

* * *

కొన్నేళ్ల తరువాత..

''ఏవండీ! మన జీవన ప్రయాణాన్ని తలుచుకుంటే నాకు చాలా ఆశ్చర్యంగా అనిపిస్తుంది. రూపాయి రూపాయికి ఎంత కష్టపడ్డాం. ఎంత పొదుపుగా సంసారాన్ని నడిపాం. ఎక్కడో పల్లెటూళ్లో చిన్నపెంకుటింట్లో పుట్టి పెరిగిన మనం.. ఇలా సిటీకి చేరి, చెరో ఉద్యోగం సంపాదించుకుని, మంచి ఇల్లు కొనుక్కుని.. మన జీతూ భవిష్యత్తును ఎంతో గొప్పగా తీర్చిదిద్దాం కదా!'' ఆనందంగా నవ్వుతూ అన్నది వైశాలి.

''ఇదంతా నీ సహకారమే వైశూ! నా ఒక్క ఉద్యోగంతో ఇదంతా జరిగేది కాదు. కల నీది. కష్టం నీది. నీ తోడు.. నాకన్నీ సాధించగలనన్న మనోధైర్యాన్ని కల్పించింది. ముందో సింగిల్ బెడ్‌రూమ్, తర్వాత డబుల్ బెడ్‌రూమ్.. అలా ఇప్పుడొక సొంత ఇల్లు కొనుక్కునే స్థాయికి వస్తామని నేనెప్పుడూ ఊహించలేదు. ఇక జితేంద్ర పెళ్లి చేసేస్తే మన బాధ్యత పూర్తిగా తీరిపోతుంది'' అన్నాడు రంగనాథ.

కొడుకు పెళ్లి ఊహకే ఎంతో మురిసిపోతూ తలూపింది వైశాలి.

రంగనాథ రిటైర్మెంట్, జితేంద్ర పెళ్లి.. ఇంచుమించుగా ఒకే ఏడాదిలో జరిగాయి. పెళ్లికూతురు ద్విజ.. యూనివర్సిటీలో హిస్టరీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నది.

పెళ్లిలో అప్పగింతలప్పుడు ఏడుస్తున్న ద్విజ తల్లిని ఓదారుస్తూ..

''ఏడవకండి వదినగారూ! నాకు ఆడపిల్లలు లేక పోయినా మీ బాధను నేను అర్థం చేసుకోగలను. మేము కూడా అయిదుగురు అప్పచెల్లెళ్లం. మా అమ్మ కూడా ఇలాగే మా అందరి పెళ్లిలలోనూ అప్పగింతలప్పుడు.. 'ఆడపిల్లలంటే ఇంటికి వచ్చిపోయే అతిథులే! వాళ్లను కని, ప్రేమగా పెంచి అత్తవారికి అప్పచెప్పడమేనా కన్నతల్లి విధి!' అంటూ భోరుమని ఏడుస్తూనే మమ్మల్ని అత్తారింటికి వదల్లేక వదల్లేక పంపించింది. అప్పట్లో మేమందరం తలా ఓ ఊరిలో, దూరంలో ఉండేవాళ్లం. కలవడం చాలా కష్టమయ్యేది. మా పెద్దక్కయ్య పిల్లలైతే.. నేను కొంచెం పెద్దయ్యాకే చూశాను. మా చిన్నబావ గారేమో.. మా చిన్నక్కను పుట్టింటికి అసలు పంపేవాడే కాదు. మా అక్కయ్యలు మా పెళ్లిళ్లప్పుడు ఒకపూట వచ్చి వెంటనే భయంభయంగా వెళ్లిపోయేవాళ్లు. ఇప్పుడా పరిస్థితి లేదు కదా! ఊళ్లో ఊరు. అయినా ద్విజ మాకు కోడలు కానే కాదు. మా కూతురే! మా కొడుకు కన్నా ఎక్కువ''.. చెమర్చిన కళ్లతో కదిలిపోతూ అన్నది వైశాలి.

* * *

''విల్లా.. ఎలా ఉంది నాన్నా!?''.. రంగనాథ వంక చూస్తూ అడిగాడు జితేంద్ర.

''చాలా విశాలంగా.. చుట్టూ మొక్కలు, పచ్చని లాన్లతో చాలా అందంగా ఉందిరా జీతూ!'' పొంగిపోతూ అన్నాడు రంగనాథ.

''ఇది బుక్ చేసుకున్న అతను హఠా

